రంజాన్ వేళలు

	ఇఫ్తార్(మంగళవారం)	సెహరీ(బుధవారం)
కర్నూలు	6:36 (సాయంత్రం)	4:49 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:33 (సాయంత్రం)	5:02 (ఉదయం)
ఆదోని	6:37 (సాయంత్రం)	4:59 (ఉదయం)



ఈ ఫొటోలో కనిపిస్తున్నది తుంగభద్ర చెక్‌పోస్టు. ప్రస్తుతం వ్యాపారులు రైతుల నుంచి కారు చౌకగా కొనుగోలు చేస్తున్న పంట ఉత్పత్తులను తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు వెళ్లాలంటే ఈ చెక్‌పోస్టును దాటాలి. ఏటా రూ.50 లక్షలకు పైగానే ఈ చెక్‌పోస్టు నుంచి సెస్సు రూపంలో ఆదాయాన్ని రాబట్టాల్సి ఉంది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, చేతివాటం కారణంగా రూ.20 లక్షల ఆదాయాన్ని రాబట్టలేకపోతున్నారు. ఉదయం, రాత్రి డ్యూటీలు వేసుకొని ఈ చెక్‌పోస్టు ద్వారా అధికారులు, సిబ్బంది సెస్సును రాబట్టాల్సి ఉంది. అయితే మధ్యాహ్నం 12.30 గంటల సమయం దాటిపోతున్నా అధికారులు కానీ.. సిబ్బంది కానీ విధుల్లో కనిపించడం లేదు. దీని వల్ల వ్యాపారులకు మంచి అవకాశం దొరికినట్టువుతోంది.



సెస్సు.. తుస్సు..!

- అధికార నేతల కనుసన్నల్లో మార్కెట్ కమిటీల చెక్‌పోస్టులు
- ఆదాయానికి గండి కొట్టి జేబులు నింపుకుంటున్న వ్యాపారులు
- సందట్లో సడేమియా తీరున అధికారులు, సిబ్బంది చేతివాటం
- ఎక్కువ ఆదాయం ఇచ్చే చెక్‌పోస్టుల్లో సిబ్బందితో నెలవారీ మామూళ్లు
- పైరవీలు, సిఫారసులతో డ్యూటీలు

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 1: ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ 15 మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో 30 చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ చెక్‌పోస్టుల ఆధారంగానే వ్యాపారులు అక్రమంగా తరలిస్తున్న పంట ఉత్పత్తులపై సెస్సు వసూలు చేయాల్సిన ఉంది. అధికారులు, సిబ్బంది చెక్‌పోస్టులను సమర్థవంతంగా పని చేయిస్తే.. ప్రతి నెలా రెండు జిల్లాల్లోనే రూ.100 కోట్లకు పైగానే సెస్సు రూపంలో ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. అయితే రూ.50 కోట్లు మాత్రమే ఏటా మార్చి చివరి నాటికి వసూలు చేసేందుకు అధికారులు, సిబ్బంది పరిమితమైపోయారు. ప్రస్తుతం అధికార నేతల కనుసన్నల్లో ఈ చెక్‌పోస్టుల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు అధికారులు, సిబ్బంది అధినేతల పేర్లు చెప్పి వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. చెక్‌పోస్టుల్లో డ్యూటీలు చేస్తే భారీగా జేబులు నింపుకోవచ్చనే ఉద్దేశంతో కొంత మంది సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు అధికార నేతలతో సిఫారసు లెటర్లు తెచ్చుకుంటున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.



సెస్సు ఆదాయానికి చెక్‌పోస్టులే కీలకం

ఉమ్మడి జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల పరిధిలో ఉన్న యార్డుల్లో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు యార్డుల్లో మాత్రమే పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన సెస్సు ఆదాయాన్ని రాబట్టేందుకు కీలకంగా ఉన్న దాదాపు 30 చెక్‌పోస్టులు ప్రస్తుతం అధికార నేతలు, సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డుల జేబులు నింపే కేంద్రాలుగా మారాయని రైతులు ఆరోపిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.50 కోట్ల సెస్సు ఆదాయాన్ని రాబట్టేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చింది. వాస్తవంగా చూస్తే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి 25 లక్షల ఎకరాల్లో ప్రధాన పంటలు సాగవుతున్నాయి. ఈ పంట ఉత్పత్తుల విక్రయం ద్వారా ఒక శాతం మార్కెట్ ఫీజును సక్రమంగా రాబట్టగలిగితే.. దాదాపు రూ.150 కోట్ల దాకా ఆదాయాన్ని మార్కెటింగ్ శాఖ రాబట్టుకునే అవకాశం ఉంది. అయితే రూ.50 లక్షల సెస్సును రాబట్టేందుకు చెక్‌పోస్టులపైనే ఆధారపడాల్సిన దుస్థితి మార్కెటింగ్ శాఖకు ఏర్పడింది. కొన్ని ప్రధానమైన చెక్‌పోస్టుల్లో పెద్ద ఎత్తున జేబులు నింపుకునేందుకు అధికార నేతల కనుసన్నల్లో అధికారులు, ఇతర సిబ్బంది పని చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తుంగభద్ర చెక్‌పోస్టులో గతంలో డ్యూటీలు చేసేందుకు అధికార పార్టీ నేతలతో అదేవిధంగా ఉన్నతాధికారులకు మామూళ్లు ఇచ్చేందుకు కూడా కొంత మంది సెక్యూరిటీ గార్డులు అత్యుత్సాహం చూపారు. తమకు తుంగభద్ర చెక్‌పోస్టుల్లో సక్రమంగా డ్యూటీలు వేయడం లేదంటూ కొంత మంది సెక్యూరిటీ గార్డులు అధికారులపై దండెత్తిన సంఘటనలు ఉన్నాయి. ఈ చెక్‌పోస్టుతోపాటు ప్రధానమైన ఇతర జిల్లాలు, రాష్ట్రాల సరిహద్దున ఉన్న చెక్‌పోస్టుల్లో డ్యూటీలు చేస్తున్న సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు పెద్ద ఎత్తున ఆదాయం పొంది అక్రమ ఆస్తులు కూడబెట్టుకున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

పని చేస్తున్నవి మూడే..

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న వ్యాపారుల ద్వారా సెస్సు వసూలు చేసేందు కోసమని ఉమ్మడి జిల్లాలో 15 మార్కెట్ కమిటీలు ఏర్పాటు చేశారు. కర్నూలు, కోడుమూరు, మంత్రాలయంతోపాటు ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె, పాణ్యం, ఆలూరు, పత్తికొండలో మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వాస్తవంగా ఈ మార్కెట్ యార్డుల్లో రైతులు పండించిన పంట ఉత్పత్తులను వ్యాపారుల చేత కొనుగోలు చేయించి వారికి మద్దతు ధరను అందించడమే కాకుండా వ్యాపారుల నుంచి ఒక శాతం సెస్సు రూపంలో ఆదాయాన్ని రాబట్టాలి. దాదాపు రూ.100 కోట్ల దాకా ఖర్చు చేసి ఈ 15 మార్కెట్ కమిటీల పరిధిలో మార్కెట్ యార్డులను ఏర్పాటు చేశారు. అయితే.. ఈ 15 మార్కెట్ యార్డులు పని చేస్తే తమ ఆదాయానికి ఎక్కడ గండి పడుతుందోనన్న భయంతో ఉమ్మడి జిల్లాలోని వ్యాపారులు అధికార నేతలపై ఒత్తిడి తెచ్చి మార్కెట్ యార్డులు ఏ మాత్రం పని చేయకుండా చేయగలిగారు. ప్రస్తుతం నంద్యాల జిల్లాలో ఏ ఒక్క మార్కెట్ యార్డులో కూడా రైతుల పంట ఉత్పత్తుల విక్రయాలు జరగడం లేదు. నందికొట్కూరులో మాత్రం నామమాత్రంగా మొక్కజొన్న కొనుగోళ్లు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో నామమాత్రంగా పంట ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయి. రైతులకు మద్దతు ధర అందించేందు కోసం మార్కెట్ యార్డులను ఏర్పాటు చేస్తే అధికార నేతల పుణ్యమా అని రూ.కోట్లు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన యార్డులన్నీ మూతపడిపోవడం దారుణమని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ మార్కెట్ యార్డులు మూగజీవాల విక్రయాలకే పరిమితం కావడంపై అన్నదాతలు మండిపడుతున్నారు.

జీరో వ్యాపారాన్ని అరికట్టేందుకు చర్యలు..

రైతులు పండించే పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు తప్పనిసరిగా ఆయా మార్కెట్ కమిటీలకు ఒక శాతం మార్కెటింగ్ ఫీజు చెల్లించాలి. అయితే చాలా చెక్‌పోస్టుల్లో కల్లుగప్పి పంట ఉత్పత్తులను సరిహద్దులు దాటించేందుకు వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి అక్రమాలను అరికట్టేందుకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ మహా చెక్ పేరుతో ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యల వల్ల చెక్‌పోస్టుల్లో అక్రమాలకు కూడా చెక్‌పెట్టినట్లయింది. ఎక్కడైనా చెక్‌పోస్టుల్లో అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తే.. వెంటనే వాటిని గాడిలో పెట్టేందుకు చర్యలు చేపట్టాం. ఈ సంవత్సరం సెస్సు ఆదాయాన్ని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు సాధించాం.

- నారాయణమూర్తి, ఏడీఎం



వేరుశనగ ధర పతనం

క్వింటా గరిష్ఠంగా రూ.7,212



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులు

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 1: ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో వేరుశనగ ధరలు మరింత పతనమయ్యాయి. సోమవారం క్వింటా వేరుశనగ ధర గరిష్ఠంగా రూ.7,212 పలికింది. గతవారంతో పోల్చితే క్వింటాకు రూ.400 పైగా ధర పతనమైంది. బోరు బావుల కింద సాగైన వేరుశనగ దిగుబడి చేతికందుతున్న తరుణంలో ధరలు పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2,800 బస్తాల వేరుశనగ విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.3,782 గరిష్ఠ ధర రూ.7,212, మధ్యస్థ ధర రూ.6,449గా పలికింది.

పోస్టల్ బ్యాలెట్‌కు 22లోగా దరఖాస్తు చేసుకోండి



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేవారు ఈ నెల 22వ తేదీలోపు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలో మే 13వ తేదీన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ రోజు ఓటు వేయలేని వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే హక్కును వినియోగించుకోవచ్చని తెలిపింది. అందుకు రాష్ట్రంలో 33 విభాగాల వారికి అవకాశం ఇచ్చింది. వారు ఫారం-12డీకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించే విభాగాలు:

మెట్రో, రైల్వే రవాణా (ప్రయాణీకులు, సరుకు, రవాణా) సేవలు, పోలింగ్ రోజు కార్యకలాపాలను కవర్ చేయడానికి కమిషన్ ఆమోదంతో అధికార లేఖలు జారీ పొందిన మీడియావ్యక్తులు, విద్యుత్ శాఖ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కోఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్ డిపార్టుమెంట్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీసు, అంబులెన్సు సేవలు, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైళ్లు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ట్రెజరీ సర్వీసు, సమాచార, ప్రజా సంబంధాల శాఖ, అటవి, పోలీసు, పౌర రక్షణ- హోంగార్డులు, ఆహార పౌర సరఫరాలు- వినియోగదారు వ్యవహారాలు, ఎనర్జీ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్టుమెంట్ ఆఫ్ పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్ విపత్తు నిర్వహణ.

ప్రారంభమైన పది స్పాట్ వాల్యుయేషన్



మూల్యాంకనం శిబిరం వద్ద ఉపాధ్యాయులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 31: స్థానిక ఎ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. మొదటి రోజే హిందీ, ఇంగ్లీషు ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. అయితే.. ఎన్నికలకు సంబంధించిన శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూల్యాంకనం విధుల్లో పాల్గొనేవారి సంఖ్య తగ్గిపోయింది. అయితే.. చాలా మంది ఉపాధ్యాయులు మూల్యాంకనం విధుల ఉత్తర్వులను రద్దు చేయించుకునేందుకు అనేక ఇబ్బందులు పడ్డారు. మరి కొంత మంది మూల్యాంకనం విధులకు ఉత్తర్వులు రాని ఉపాధ్యాయులు మూల్యాంకన శిబిరం బయటనే పడిగాపులు కాశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకుల సహాయంతో కొంత మంది విధులకు సంబంధించిన ఉత్తర్వులను దక్కించుకోగా.. మరికొంత మంది ఉపాధ్యాయులు నిరుత్సాహంతో వెనుదిరిగిపోయారు. దీంతో మూల్యాంకనం శిబిరం బయట అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలి రావడంతో గందరగోళం ఏర్పడింది. అయితే.. విద్యాశాఖ అధికారులు విధుల ఉత్తర్వులను నిబంధనల మేరకు సడలింపు ఇవ్వడంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

మఠం భూమి మాయం

- ఆదోని వైసీపీ ఎమ్మెల్యే అనుచరుడి కబ్జా
- దర్జాగా ఇసుక డంప్‌లకు లీజుకిచ్చిన వైనం



కల్లుమఠం బసవేశ్వరస్వామి దేవాలయం



మఠం భూమిని ఇసుక డంప్‌లకు లీజుకిచ్చిన వైసీపీ నాయకుడు

ఆదోని రూరల్, ఏప్రిల్ 1: వైసీపీ నాయకులకు కన్ను పడితే చాలు అది ఎలాంటి భూమైనా కబ్జా కావాల్సిందే. వివరాల్లోకెళ్తే... ఆదోని పట్టణంలోని ఏస్కేడి కాలనీలో కల్లుమఠం బసవేశ్వర స్వామి దేవాలయం ఉంది. ఈ దేవాలయానికి సంబంధించి చాలా చోట్ల భూములు ఉన్నాయి. మండిగిరి పంచాయతీ పరిధిలోని ఆస్పరి - ఎమ్మిగనూరు బైపాస్‌లో 552 సర్వే నెంబరులో రోడ్డుకిరువైపులా 1.78 ఎకరాల భూమి ఉంది. నాడు బైపాస్ రోడ్డు వేయడంతో 1.35 ఎకరాల భూమి రోడ్డుకు పోగా, 43 సెంట్ల భూమి మిగిలింది. ప్రస్తుతం సెంటు భూమి మార్కెట్ విలువ ప్రకారం రూ.20లక్షలు పలుకుతోంది. దాదాపు ఈ స్థలం విలువ రూ.8 కోట్ల పైమాటే. ఈ స్థలంపై వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రధాన అనుచరుడు వలస వైసీపీ నాయకుడు సుబ్బారెడ్డి కన్ను పడింది. ఆఘమేఘాలపై ఎమ్మెల్యే అండదండలతో ఈ స్థలాన్ని కబ్జా చేయడంతోపాటు రెండు సంవత్సరాలుగా ఇసుకను విక్రయించే కంపెనీకి లీజుకిచ్చాడు. దీంతో సదరు కంపెనీ మఠం స్థలంలో ఇసుకను డంప్ చేసి సుబ్బారెడ్డికి లీజు కింద డబ్బులు చెల్లిస్తోంది. విషయం తెలుసుకున్న మఠం సభ్యులు, బీజేపీ నాయకులు కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి అవాక్కయ్యారు. దేవుడి భూమిని కూడా వదలరా అని మండిపడుతున్నారురు. సదరు వైసీపీ నాయకుడు సుబ్బారెడ్డి ప్రభుత్వ సర్వే నెం.538లో ఉన్న కొండను పిండి చేసి 20 సెంట్ల మేర అక్రమించి ఇంద్ర భవనాలను నిర్మించి అమ్మేశాడని ఆదోని కోడై కూస్తోంది. అలాగే పట్టణ నడిబొడ్డున జిమ్ సమీపంలో ఉన్న మున్సిపాలిటీ పార్కులో కొంత స్థలాన్ని తనకు అనుకూలంగా మార్చుకొని పార్కు మీదుగా వెళ్లిన కాల్వను వేరే రకంగా మళ్లించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మఠం భూమి అక్రమణకు గురైంది...

మా కల్లు మఠం భూమి అక్రమణకు గురైంది. సుబ్బారెడ్డి అనే వ్యక్తి మా మఠం భూమిని ఆక్రమించి ఇసుక వ్యాపారులకు లీజుకిచ్చాడు. ఎలాగైనా అధికారులు మఠం భూమిని కాపాడాలి.

-గురు సిద్ధ దేవర కల్లు మఠాధిపతి, ఆదోని

వైసీపీ నాయకుడిపై కోర్టుకెళ్తాం

కల్లుమఠం భూమిని ఆక్రమించి ఇసుక వ్యాపారులకు లీజుకిచ్చిన వైసీపీ నాయకుడు, ఎమ్మెల్యే అనుచరుడు సుబ్బారెడ్డిపై న్యాయ పోరాటం చేయడంతోపాటు కోర్టుకెళ్తాం. సదరు సుబ్బారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రూ.కోట్ల విలువ చేసే భూములను వైసీపీ నాయకులు కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారా?

- నాగరాజు గౌడ్, బీజేపీ నాయకుడు, ఆదోని

విచారించి చర్యలు తీసుకుంటాం

కల్లు మఠం భూమి కబ్జాకు గురైన విషయం నా దృష్టికి రాలేదు. కింది స్థాయి సిబ్బంది దృష్టికి వచ్చిందేమో తెలుసుకుంటా. ఆర్ఐ, వీఆర్ఓను పంపి విచారించి తగు చర్యలు తీసుకుంటాం.

హసీనా సుల్తానా, తహసీల్దార్, ఆదోని



ఈవీఎంలపై సూచనలిస్తున్న కలెక్టర్

ఈవీఎం కనెక్షన్‌పై అవగాహన ఉండాలి : కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1: ఎన్నికల పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా పోలింగ్ రోజున పూరించాల్సిన 17సీ, పీవో డైరీ, పీవో రిపోర్టులతో పాటు ఈవీఎం కనెక్షన్ మీద స్పష్టమైన అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డా.జి.సృజన పేర్కొన్నారు. సోమవారం ఎంఆర్‌సీ కన్వెన్షన్ సెంటరులో సాధారణ ఎన్నికల-2024 నిర్వహణపై మొదటి సెషన్‌లో కోడుమూరు, ఆదోని, రెండో సెషన్‌లో కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల పీవోలు, ఏపీవోలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ రోజున పూరించాల్సిన 17సీ, పీవ డైరీ, వచ్చిన పీవో రిపోర్టులపై శిక్షణ ఇచ్చామని అన్నారు. గ్రీన్ పేపర్ సీల్, పింక్ పేపర్ సీల్, అడ్రస్ ట్యాగ్స్, స్పెషల్ ట్యాగ్స్ లాంటి అంశాలపై చాలా అవగాహన అవసరమని తెలిపారు. ఎన్నికల పోలింగ్ ముందు రోజు మే 12వ తేదీన మెటీరియల్ డిస్ట్రిబ్యూట్ చేసిన తర్వాత మెటీరియల్ మొత్తం వచ్చిందో..? లేదో..? అని ఏ విధంగా చెక్ చేసుకోవాలని, పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత ఏం చేయాలి.. పోలింగ్ కేంద్రం ఏ విధంగా ఏర్పాటు చేసుకోవాలనే అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. త్వరలోనే మూడు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పాణ్యం ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, కోడుమూరు ఆర్వో కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్వో ఆర్డీవో రామలక్ష్మి, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి, పీవో, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

జగన్ సాగిస్తున్న విధ్వంస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. పోలింగ్ ఎప్పుడు వస్తుందా..? ఈ జగన్‌ను ఎప్పుడు ఇంటికి పంపుదామా అని ప్రజలు ఎంతో కసిగా ఎదురు చూస్తున్నారు. మేము ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.. సుదీర్ఘ పాలనా అనుభవం ఉన్న చంద్రబాబు విజన్.. ప్రధాని మోదీ ఇమేజ్.. రాష్ట్ర అభ్యున్నతికి పరితపిస్తున్న జనసేన అధినేత పవన్ కమిట్‌మెంట్ ఈ రాష్ట్రానికి ఎంతో అవసరం అని రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారు.. కర్నూలు పార్లమెంట్ పరిధిలో కరువు, వలసల నివారణకు నన్ను ఎంపీగా గెలిపిస్తే ప్రాజెక్టులు, పరిశ్రమలు తీసుకొస్తాం.. యువతకు ఉపాధి కల్పిస్తా.. యువనేత లోకేశ్ యువగళం పాదయాత్రలో పల్లెసీమల్లో ప్రజల కష్టాలు కళ్లారా చూసి రాయలసీమ డిక్లరేషన్ తీసుకొచ్చారు.. బీసీలలో ఉప కులమైన కురవ సామాజికవర్గానికి మా అధినేత చంద్రబాబు నమ్మకంతో ఎంపీ టికెట్ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థులను సమన్వయం చేసుకొని.. వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ప్రజలకు తెలియజేసి.. పేదలను సంపన్నులుగా మార్చే టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వివరించి.. ఎంపీతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించి అధినేతకు కానుగా ఇస్తాం. మా ప్రత్యర్థి జగనే.. ఆయనను ఇంటికి పంపడమే మా లక్ష్యం.. అంటున్నారు కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు. ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.



మా ప్రత్యర్థి జగనే

- విధ్వంస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం
- కర్నూలు జిల్లాలో కరువు, వలసలు కవలలు
- నివారణకు ప్రాజెక్టులు, పరిశ్రమలు తీసుకొస్తాం
- నన్ను ఎంపీగా పార్లమెంట్‌కు పంపండి.. జిల్లాను అభివృద్ధి చేసి చూపిస్తా
- చంద్రబాబు విజన్.. మోదీ ఇమేజ్.. పవన్ కమిట్‌మెంట్ రాష్ట్రానికి అవసరం
- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో కర్నూలు ఎంపీ టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

- కర్నూలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి)

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి : బీసీలలో సామాన్య కుటుంబానికి చెందిన మీకు టీడీపీ అధినేత చంద్రబాబు ఎంపీ టికెట్ ఇచ్చారు. ఎలా ఫీల్ అవుతున్నారు..?



● **బస్తిపాటి నాగరాజు:** టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాపై ఎంతో నమ్మకంతో కర్నూలు ఎంపీ టికెట్ ఇచ్చారు. ఈ ఆనందం మాటల్లో చెప్పలేనిది. బీసీలలో ఉప కులమైన కురవ సామాజకవర్గం నుంచి 1972లో కేబీ నరసప్ప పత్తికొండ ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ 52 ఏళ్లలో ఏ రాజకీయ పార్టీ కూడా మాకు టికెట్ ఇవ్వలేదు. ఇన్నేళ్లకు మా అధినేత చంద్రబాబు గుర్తించి ఎంపీ టికెట్ ఇచ్చారు. వంద శాతం కురవలు చంద్రబాబుకు రుణపడి ఉంటారు. శక్తివంచన లేకుండా కృషి చేసి ఎంపీ సహా ఏడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించి అధినేతకు కానుకగా ఇస్తాం.

● నామినేషన్ల గడువు దగ్గర పడుతోంది.. ప్రచారం ఎలా సాగుతోంది?

● **నాగరాజు:** ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. జగన్ ఐదేళ్ల విధ్వంస పాలనకు చరమరగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారు. పోలింగ్ ఎప్పుడు వస్తుందా..? ఈ జగన్‌ను ఎప్పుడు ఇంటికి పంపుదామా..? అని ఎదురు చూస్తున్నారు. పసుపు జెండా పట్టుకొని ముందుకు సాగుతున్నారు. రైతులు, కూలీలు, యువత, ఉద్యోగులు నుంచి అనుహ్య స్పందన వస్తుంది. ఈ రాష్ట్రం బాగు కోసం పాలనానుభవజ్ఞుడైన చంద్రబాబు విజన్.. ప్రధాని మోదీ ఇమేజ్.. జనసేన అధినేత పవన్ కమిట్‌మెంట్ కావాలని ప్రజలు కోరుతున్నారు.

● మీకు ప్రత్యర్థిగా కర్నూలు మేయర్ బీవై రామయ్యను వైసీపీ బరిలో నిలిపింది. ఎలా ఎదుర్కోబోతున్నారు..?

● **నాగరాజు :** మాకు ప్రత్యర్థి జగనే. ఆయనపైనే మా పోరాటం. చంద్రబాబు పాలనలో ప్రగతి పథంలో పరుగులు పెడుతున్న నవ్యాంధ్రను అప్పులాంధ్రగా మార్చారు. ఒక్క చాన్స్ అంటే నమ్మి మోసపోయామని ప్రజులు కసిగా ఉన్నారు. రాష్ట్రం అభివృద్ధి కోసం జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

● ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం.. మీరు ఎంపీగా గెలిచాక ఎలాంటి అభివృద్ధి చేస్తారు..? మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటీ..?

● **నాగరాజు:** కర్నూలు వ్యవసాయంపై ఆధారపడ్డ జిల్లా. గ్రామాల్లో తాగునీరు, వలసలు, రోడ్లు, పేదలకు పక్కా ఇళ్లు వంటి సమస్యలు ఉన్నాయి. విద్యా, వైద్యం రంగాలు కూడా మరింత మెరుగుపడాలి. యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా పల్లె పల్లెన నడిచారు. ప్రజల కష్టాలు కళ్లారా చూశారు. కళ్ల ముందే రైతులు, కూలీలు వలస వెళ్తుంటే చలించిపోయారు. అందుకే రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. మా ప్రభుత్వం వచ్చిన తొలి రోజు నుంచి డిక్లరేషన్ అమలు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తాను.

● కరువు.. వలసల నివారణకు మీ వద్ద ఉన్న ప్రణాళిక?

● **నాగరాజు:** జిల్లాను వెంటాడుతున్న కరువు, వలసలు ఆపాలంటే సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు తీసుకురావాలి. నన్ను ఎంపీగా గెలిపిస్తే వీటికే తొలి ప్రాధాన్యత ఇస్తా. చంద్రబాబు ప్రభుత్వంలో ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాలకు కరువు నివారణే లక్ష్యంగా రూ.10 వేల కోట్లు మంజూరు చేసి వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల జలాశయానికి శ్రీకారం చుట్టారు. వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు టెండర్లు పూర్తి చేసి పనులు కూడా మొదలు పెట్టారు. జగన్ ప్రభుత్వం రాగానే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. వాటి పనులు తిరిగి ప్రారంభించి గడువులోగా పూర్తి చేస్తాం. ఎల్లెల్సీ నుంచి రావాల్సిన 24 టీఎంసీలు వాటా కోసం కృషి చేస్తాం. అదే క్రమంలో పరిశ్రమలు తీసుకొస్తే యువతకు ఉపాధి లభిస్తుంది. వలసలు ఆగుతాయి. పత్తికొండలో టమోట జ్యూస్ పరిశ్రమ, ఆలూరు ప్రాంతంలో సోలార్, విండ్ పవర్, ఎమ్మిగనూరు ప్రాంతంలో టెక్స్‌టైల్ పరిశ్రమ.. ఇలా ఏ ప్రాంతంలో ఏ పరిశ్రమ అవసరమో గుర్తించి ఏర్పాటు చేసేలా ప్రణాళికతో ముందుకు సాగుతాను.

● రైల్వే కోచ్ పూర్తి.. కొత్తగా రైళ్లు తెప్పించే బాధ్యత తీసుకుంటారా..?

● **నాగరాజు:** తప్పకుండా తీసుకుంటాను. రైల్వే కోచ్ పరిశ్రమ మా గ్రామ పంచాయతీ పరిధిలోనే ఉంది. పనులు స్లోగా సాగుతున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సకాలంలో పూర్తి అయ్యేలా చూస్తాను. కర్నూలు సహా ఆదోని ప్రాంతాల నుంచి రాజధాని అమరావతికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉన్నమాట నిజమే. రాష్ట్రం, కేంద్రంలో రాబోయేది ఎన్డీఏ ప్రభుత్వమే. ఎంపీగా రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక రైళ్లు వేసేలా కృషి చేస్తాను. అలాగే.. జగన్ ప్రభుత్వం వచ్చాక భూ సేకరణలోనే ఆగిపోయిన రాయలసీమ-అమరావతి ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి కృషి చేస్తాను.



చంద్రబాబు పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరిస్తున్న నాగరాజు


● చేనేతల అభ్యున్నతికి ఎలాంటి కృషి చేస్తారు..?

● **నాగరాజు :** కర్నూలు, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో చేనేతలు అధికంగా ఉన్నారు. ఎమ్మిగనూరు వద్ద టెక్స్‌టైల్ పరిశ్రమ నిర్మించడం వల్ల చేనేతలకు జీవన ప్రమాణాలు పెరుగుతాయి. బీసీ కులాల కార్పొరేషన్లను జగన్ నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక కార్పొరేషన్లకు నిధులు కేటాయింపులు ఉంటాయి. వాటి ద్వారా బీసీ కులాలు ఆర్థిక అభివృద్ధి కోసం ముందుకు సాగుతాను.



టీడీపీ నాయకులతో కలసి మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు

● రాజకీయాల్లో రావడానికి మీకు స్ఫూర్తి ఎవరు..?



● **నాగరాజు:** మాది సామాన్య రైతు కుటుంబం. నేను పత్తికొండలో పెళ్లి చేసుకున్నా.. మా మమ శ్రీనివాసులు మార్కెట్ యార్డు చైర్మన్‌గా, జడ్పీటీసీగా పని చేశారు. ఆయనను చూసి నేనుందుకు రాజకీయాల్లోకి రాకూడదు అనుకునేవాడ్ని. నేను ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఈడీ చేశాను. ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పని చేశాను. ఆ సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపు ఇచ్చారు. ఆ ప్రేరణే నన్ను రాజకీయల వైపు అడుగులు వేసేలా చేసింది. ఎన్నికల ప్రచారంలో రోజంతా జనం మధ్యనే ఉంటున్నాను. నా భార్య జయసుధ, కుటుంబ సభ్యులు ప్రోత్సాహం మరవలేనిది.

పింఛన్ డబ్బులు మళ్లింపు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 1: పింఛన్ల డబ్బును సీఎం జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరతే కారణమని అన్నారు. ఈ నెల 1న ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని జగన్‌రెడ్డి ఎందుకు ఆదేశాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 1.35 లక్షల సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధ ప్రాతిపదికన పింఛన్లు ఇంటి వద్దే పంపిణీ చేయడానికి సాధ్యమవుతుందని, జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయాల వల్లే పింఛన్‌దారులు, వలంటీర్లు నష్టపోతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తుందని తెలిపారు. ఒకటో తారీఖున పెన్షనర్లకు ఇవ్వాల్సిన డబ్బును జనవరి 23న బటన్ నొక్కి ఆసరా డబ్బును, ఫిబ్రవరి 16న బటన్ నొక్కిన ఈబీసీ నేస్తం డబ్బును ఆరోగ్యశ్రీకి ఇవాల్సిన నిధులు రూ 13 వేల కోట్లు మార్చి 16 నుంచి 30 వరకు లోపు అంటే 15 రోజుల్లోనే జగన్‌రెడ్డి అనుకూలమైన కాంట్రాక్టర్లకు మొత్తం దోచిపెట్టారని ఆరోపించారు. దుర్మార్గాన్ని కప్పిపెట్టుకోవడానికి ఎన్నికల కమిషన్, నిమ్మగడ్డ రమేష్ కుమార్, తెలుగుదేశం పార్టీపైన దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి

ఇద్దరి పరిస్థితి విషమం

కోసిగి, ఏప్రిల్ 1: బైక్ అదుపు తప్పి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన కోసిగి మండలంలోని లక్మారి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కోసిగి మండల కేంద్రానికి చెందిన మోనేష్ ఆచారి(25), శ్రీకాంత్ ఆచారి, సూరిపోగు బాషా ముగ్గురు స్నేహితులు. వీరు సొంత పనుల నిమిత్తం రాయచూరు జిల్లా గిలకసూగూరు క్యాంప్‌నకు వెళ్లి బయలుదేరారు. తిరిగి వస్తుండగా ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో లక్మారి గ్రామ సమీపంలోని దేవాలయం దగ్గర బైక్ అదుపు తప్పి ముగ్గురు కిందకు పడ్డారు. వీరిని కర్నూలు ఆసుపత్రికి అంబులెన్సులో తరలిస్తున్న సమయంలో కోడుమూరు సమీపంలో మోనేష్ ఆచారి మృతి చెందాడు. సూరిపోగు బాషా పరిస్థితి విషమంగా ఉండటంతో కోమాలోకి వెళ్లినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. శ్రీకాంత్ ఆచారికి కాళ్లు, చేతులు విరిగిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఒక ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదఛాయలు నింపాయి. కోసిగిలోని 9వ వార్డు రైల్వేగేటు సమీపంలో విషాదచాయలు అలుముకున్నాయి. కమ్మరి శ్రీనివాసులు, ఈశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు. చిన్నవాడు మోనేష్ ఆచారి ఏడాది క్రితమే పెళ్లయింది. మృతుడి భార్య ప్రియాంక నాలుగు నెలల గర్భిణి. భర్త చిన్న వయసులోనే చనిపోవడంతో భార్య ప్రియాంకతో పాటు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మాధవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడికి గాయాలు

హొళగుంద, ఏప్రిల్ 1: అభం శుభం తెలియని ఐదేళ్ల బాలుడిపై ఓ అంగన్వాడీ ఆయా అన్నం వార్చిన గంజిని వేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హొళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామంలోని అంగన్వాడీ-2వ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బాలస్వామి, ఉలిగమ్మ దంపతుల కుమారుడు ఐదేళ్ల మల్లప్ప రోజులాగే సోమవారం ఉదయం అంగన్వాడీ కేంద్రానికి చదువుకునేందుకు వెళ్లాడు. ఉదయం 10:30 సమయంలో అంగన్వాడీ కేంద్రం పక్కనున్న పొదల్లో మూత్ర విసర్జన చేసి తిరిగి వస్తుండగా అంగన్వాడీ ఆయా లక్ష్మీ అప్పుడే అన్నం వార్చిన వేడివేడి గంజిని బయటకు పడేసింది. ఆ గంజి అక్కడే ఉన్న బాలుడి మొహం, ఛాతిపై పడటంతో ఒళ్లు కాలి బొబ్బలు వచ్చాయి. కాలిన మంటలకు బాలుడు గట్టిగా అరవడంతో గమనించిన ఆయా బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి ఆ బాలుడి ఇంటి ముందు వదిలి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు అంగన్వాడీ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. అనంతరం బాలుడికి మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అంగన్వాడీ ఆయా, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు.

అల్లూరులో హైడ్రామా



టీడీపీ నాయకులను ఫొటోలు తీస్తున్న హైదరాబాద్ సీసీఎస్ సీఐ

- మాండ్ర అరెస్టుకు తెలంగాణ పోలీసుల యత్నం
- నోటీసులు చూపిస్తే వస్తానన్న శివానందరెడ్డి..?

నందికొట్కూరు, ఏప్రిల్ 1: నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో సోమవారం హైడ్రామా నడిచింది. నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిని అరెస్టు చేయడానికి వచ్చామంటూ తెలంగాణ పోలీసుల బృందం హడావుడి చేసింది. వివరాలు ఇలా.. తెలంగాణ సీసీఎస్ సీఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఉదయం 6:15 గంటలకు మాండ్ర శివానందరెడ్డి స్వగ్రామమైన అల్లూరుకు చేరుకున్నారు. అనంతరం మాండ్ర ఇంటికి వెళ్లి ఓ ల్యాండ్ (క్రైమ్ నంబర్ 194) కేసులో అరెస్టు చేయడానికి వచ్చామని చెప్పారు. దీంతో అరెస్టు వారెంట్‌తోపాటు కేసుకు సంబంధించిన కాగితాలు, రికార్డులను చూపాలని మాండ్ర కోరారు. అలాంటివి ఏమీ లేకుండా అరెస్టు చేయడానికి ఇంటిలోకి ఎలా వస్తారని వారిని నిలదీశాడు. కేసుకు సంబంధించిన రికార్డులు, నోటీసులను చూపితే పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. తాను కూడా ఒక సీనియర్ పోలీసు అధికారిని అని, చట్టం గురించి తెలుసునని చెప్పడంతో పోలీసులు ఏమీ చేయలేక వెనుదిరిగారు.

రాజకీయంగా దెబ్బతీసేందుకే..

రాజకీయంగా దెబ్బతీసేందుకే మాండ్రను అరెస్టు చేయాలని చూశారని మాండ్ర శివానందరెడ్డి సోదరుడు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి అన్నారు. తెలంగాణ పోలీసులు తమ ఇంట్లోకి దౌర్జన్యంగా చొరబడి విచారణ పేరుతో భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. దీంతో బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇదే విషయంపై నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య స్పందిస్తూ నందికొట్కూరులో టీడీపీ గెలవకూడదనే వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి తన స్వార్థం కోసం మాండ్రపై మచ్చ వేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు.

నాపై తప్పుడు ప్రచారం



నందికొట్కూరు నియోజకవర్గంలో తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, తెలంగాణ పోలీసులు నోటీసులు ఇస్తే తప్పకుండా సహకరిస్తామని మాండ్ర శివానందరెడ్డి ఓ వీడియో ద్వారా తెలిపారు. హైదరాబాదు పోలీసులు తన ఇంటికి వచ్చింది వాస్తవమేనని, న్యాయవాదులు రంగారెడ్డి, సురేష్‌లు కేసుకు సంబంధించిన నోటీసులు, అరెస్టు వారెంటు లాంటి పేపర్లను అడిగారన్నారు. హైదరాబాదుకు వస్తే పేపర్లు ఇస్తామని పోలీసులు చెప్పారని, దీంతో తాను తెలంగాణ పోలీసులకు సహకరించలేదని వివరించారు. తనకు సంబంధంలేని నేరస్తులుగా భావించి విచారణ పేరుతో హైదరాబాదుకు తరలిస్తామంటే ఒప్పుకోమని చెప్పారు. 91 నోటీసులు ఇస్తే పోలీసులకు తప్పకుండా సహకరిస్తామని మాండ్ర స్పష్టం చేశారు.

మాకు ఎలాంటి సమాచారం లేదు

తెలంగాణ పోలీసులు మాకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. మాండ్ర శివానందరెడ్డి విచారణకు సహకరించడం లేదని, బందోబస్తు కావాలని తెలంగాణ పోలీసులు కోరారు. దీంతో మేము పోలీసు సిబ్బందిని పంపాం. ఏ కేసులో అరెస్టు చేసేందుకు వచ్చారో కూడా మాకు తెలియదు.

- విజయభాస్కర్,
నందికొట్కూరు రూరల్ సీఐ

ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

రూ.3 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఆదోని, ఏప్రిల్ 1: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని ఆదోని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ శివనారాయణ స్వామి వెల్లడించారు. ఆదోని మండలం ధణాపురం గ్రామం వెళ్లే రహదారిలోని పాతబడిన ఇందిరమ్మ ఇళ్లలో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆదోనిలోని బోయగేరి కాలనీకి చెందిన ఆంజనేయులు అలియాస్ కుంటి అంజి ముంబై ఇండియన్స్-రాజస్థాన్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి, నిందితుడిని అదుపులో తీసుకున్నారు. అతని వద్ద నుండి రూ.3 లక్షల నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అతడ్ని రిమాండ్‌కు తరలించారు.

పసుపు అధరహో ● 250 కేజీలు రూ.6వేలు



రుద్రవరం, ఏప్రిల్ 1: పసుపునకు మంచి ధర లభిస్తోంది. పుట్టి (250 కేజీలు) పసుపు కొమ్ములు రూ.6వేలు పలుకుతున్నాయి. గత ఏడాది పుట్టి పసుపు రూ.1500 నుంచి రూ.1600 పలికింది. 20 ఏళ్ల తరువాత తొలిసారిగా పసుపునకు మంచి ధర వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. 700 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేశారు. ఒక్కసారిగా పుట్టిపై రూ.4500 అదనంగా రేటు పలికింది.

సీఎం జగన్ నిర్ణయంతో ఖజానా ఖాళీ



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఏప్రిల్ 1: ప్రతి నెలా 1వ తేదీన పంపిణీ చేయాల్సిన సామాజిక పింఛన్ల మొత్తాన్ని సీఎం జగన్ రెడ్డి తన సొంత కాంట్రాక్టర్లకు ఇవ్వడంతో ఖజానా ఖాళీ అయిందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం హుశేనాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల సొమ్మును సీఎం జగన్ వైసీపీ కాంట్రాక్టర్లకు ఇచ్చారని, దీంతో వృద్ధులు, వితంతులు, వికలాంగులకు పింఛన్ పంపిణీ చేయడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్లపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మహబూబ్‌బాషా, కేవీ మధు, వలి, వేణు, బజారు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై సమీక్ష

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1: విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ తదితర అంశాలపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి అధికారుల బాధ్యతలు, నిర్వహించాల్సిన విధులు, ఏప్రిల్, మే, నెలల్లో తేదీల వారిగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు, పోలీసులు ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించేందుకు అవస రమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు కలెక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

గూడూరు, ఏప్రిల్ 1: ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం గూడూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి లో తీవ్ర మైన ఎండ, వేడి గాలులు వీచినప్పుడు వడదెబ్బకు గురి కాకుండా ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో వడదెబ్బకు గురైనప్పుడు ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత పెరగ డం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండి పోవడం, శరీరంలో నీటి శా తం కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అలాగే డెలివరీ రూము, ల్యాబ్, ఐపీ, ఓపీ, మందుల స్టోర్‌ను పరిశీలించారు. ప్రతి నెల ఆరోగ్య కేంద్రంలో జరిగే డెలివరీల గురించి డాక్టర్‌ను అడిగి తెలుసు కున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబా టులో ఉండాలని సూచించారు. అయన వెంట వైద్యాధికారి షఫియా బేగం, ఎంపీహెచ్ఈవో రామకృష్ణ, హెచ్ఎస్ రాఘవయ్య, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ ఉన్నారు.

గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రీబాయి



కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 1: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జి గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రీబాయి నియమితులయ్యారు. మార్చి 31న గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకట తులసమ్మ పదవీ విరమణ పొందడంతో ఇన్‌చార్జి గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రీబాయిని నియమిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలుకు చెందిన సావిత్రీబాయి, కర్నూలు, పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 26 ఏళ్లు పని చేశారు. 1998లో స్టాఫ్ నర్సు గా, 2010లో హెడ్ నర్సుగా, 2020 జూన్ 28న గ్రేడ్-2 నర్సింగ్ సూపరిం టెండెంట్‌గా పదోన్నతి పొందారు. 2024 ఏప్రిల్ 1న గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు.

పెద్దాసుపత్రికి ఇద్దరు ఏడీలు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 1: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు ఏడీలు (అసిస్టెంట్ డైరెక్టర్‌లు) కొనసాగుతున్నారు. ఉద్యోగుల వేతనాల బిల్లులను ఏడీ రమేష్‌బాబుకు కేటాయించారు. ఇన్‌చార్జి ఏడీగా ఉన్న కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీ అనిల్ కుమార్ రెడ్డికి హెచ్‌డీఎస్, ఆరోగ్యశ్రీ, డీడీ అకౌంట్స్, థర్డ్ పార్టీ ఏజెన్సీ సర్వీసుల బిల్లుల పనులను అప్పగించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అనుమతులు తీసుకుని ఏడీలకు, పని విభజన చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ వీ.వెంకటరంగారెడ్డి తెలిపారు. కలెక్టర్‌కు కూడా ఈ విషయాన్ని తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపుదాం

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 1: అవ్వా తాతలకు పింఛన్ డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్న జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపుదాం తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్, ఇతర పథకాల నిధులు కాంట్రాక్టర్లకు కోడ్ నిబంధనలు ఉల్లంఘించి దోచి పెట్టిన జగన్ చెప్పే అబద్ధాల మాటలు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు.

టీడీపీ ఆవిర్భావం నుంచి సేవలందించారు

కార్యకర్తల మధ్య సోమిశెట్టి జన్మదిన వేడుకలు



సోమిశెట్టికి కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 1: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం సేవలందించిన నాయకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లా డుతూ రానున్న రోజుల్లో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. నంద్యాల నాగేంద్ర మాట్లాడుతూ సోమిశెట్టి పార్టీ కోసం ఆహర్నిశలు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాగరాజు యాదవ్, ఎస్. అబ్బాస్, బషీర్ ఆహ్మద్, సోమిశెట్టి నవీన్, షేక్ ముంతాజ్, చంద్రాకాంత్, సత్రం రామక్రిష్ణుడు, పెరపోగు రాజు, భాస్కర్‌రెడ్డి, భరత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాజులదిన్నెలో 0.90 టీఎంసీల నీటిని నిల్వ చేయండి

కర్నూలు (న్యూసిటీ), ఏప్రిల్ 1: నగర ప్రజల తాగు నీటి అవసరాల నిమిత్తం గాజులదిన్నె ప్రాజెక్టులో 0.90 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని కమిషనర్ ఎ.భార్గవతేజ సోమవారం జలవనరుల శాఖ ఎస్ఈకి లేఖ రాశారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు నగర ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రతి రోజు గాజులదిన్నె నుంచి 58 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం సుంకేసుల జలాశయం పూర్తిగా నీరు అడుగంటిపోవడంతో గాజులదిన్నె నుంచే నగరవాసులకు నీటిని వినియోగించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మత రాజకీయాలు చేసే వారిని నమ్మొద్దు

ఇఫ్తార్ విందులో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 1: మతం పేరుతో రాజకీయాలు చేసే వారిని నమ్మొద్దు అని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ముస్లింలకు సూచించారు. సోమవారం నగరంలోని కేవీఆర్ గార్డెన్‌లో ఉన్న సూపర్ ఫంక్షన్‌లో హాలులో 10, 11 వార్డులకు సంబంధించిన ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము 40 ఏళ్లుగా ప్రజా సేవ చేస్తున్నామని, ఇంతవరకు ఏ ఒక్క ముస్లిం కుటుంబానికి అన్యాయం చేయలేదని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కూటమికి ఓటు వేస్తే ముస్లింలకు అన్యాయం జరుగుతుందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసం మాత్రమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామన్నారు. పార్లమెంట్‌లో సీఏఏ, ఎన్ఆర్సీ బిల్లులకు వైసీపీ పూర్తి మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో రంజాన్ తోఫా, షాదీ ముభారక్, విదేశీ విద్య, వంటి మంచి సంక్షేమ పథకాలను అందజేసినట్లు గుర్తు చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా కొందరు నాయకులు కులం, మతం పేరుతో లబ్ధి పొందాలని చూస్తున్నారని టీడీపీ మైనార్టీ నాయకులు ప్రజలకు వివరించారు. కేవలం ప్రజా సేవ కోసమే



ప్రజలతో మాట్లాడుతున్న టీజీ భరత్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీజీ భరత్

టీజీ కుటుంబం రాజకీయాల్లో ఉందన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి మహబూబ్ ఖాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బషీర్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాషా, మౌలానా, ముస్తాఫా, ఖజా, గౌస్, జీయా, ఫర్హానా, సఫా, చిన్నమ్మి, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

టీడీపీ వస్తేనే పేదల జీవితాల్లో వెలుగులు: తెలుగుదేశం ప్రభుత్వం వస్తేనే పేదల జీవితాల్లో వెలుగులు వస్తాయని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 18వ వార్డు జోహరాపురంలో టీజీ భరోసా యాత్ర చేపట్టారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సంక్షేమం పథకాలు వివరించారు. ఈప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని, సంక్షేమ పథకాల పేరుతో డబ్బులు ఇచ్చి నిత్యావసర సరుకుల ధరలు, పన్నులు, విద్యుత్ చార్జిలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు మోహ న్, వెంకటసుబ్బయ్య, మాధవస్వామి, తిమ్మోజీ, కార్పొరేటర్ పర మేష్, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, ఎల్లా గౌడ్, తిరుపతయ్య, తిమ్మప్ప, చిట్టెమ్మ, శాంతమ్మ, అనిత, ఆనంద్ పాల్గొన్నారు.

పింఛన్ డబ్బులు మళ్లించిన ద్రోహి జగన్

వైసీపీ తీరుపై గౌరు దంపతుల ఆగ్రహం

కల్లూరు, ఏప్రిల్ 1: ఖజానాలోని పింఛన్ డబ్బులు కాంట్రాక్టర్లకు మళ్లించిన ద్రోహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తన స్వగృహంలో నిర్వహిం చిన సమావేశంలో వైసీపీ నాయకుల ఆరోపణలను గౌరు దంపతులు తిప్పికొ ట్టారు. పింఛన్ పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు జగన్‌రెడ్డి కుట్రలు చేస్తు న్నారని ఆరోపించారు. అవ్వా తాతలకు పింఛన్లు పంపిణీ చేయకుండా ప్రతిపక్షాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులను బూచీగా చూపి డబ్బు పంపిణీ ఎగ్గొట్టేందుకు, నిధుల ఇవ్వకుండా విపక్షాలపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆసహనం వ్యక్తం చేశారు. చివరి లబ్ధిదా రుడి వరకు పింఛన్ ఇవ్వాల్సిందేనని, అడ్డదారుల్లో అస్మదీయులకు వేలకోట్ల బిల్లులు చెల్లించి, అవ్వాతాతల పింఛన్ డబ్బులు సొంత కాంట్రక్టర్లకు పంచిపెట్టే హక్కు జగన్‌కు ఎవరిచ్చారని గౌరు దంపతులు ప్రశ్నించారు. తక్షణమే అర్హులైన వారందరికీ పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో కర్నూలు మాజీ మార్కెట్ మార్డ్ ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు



మాట్లాడుతున్న గౌరు దంపతులు

పింఛన్ సొమ్ము కాంట్రాక్టర్లకు.. టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు

కర్నూలు(కల్చరల్): పింఛన్ల డబ్బును సీఎం జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని టీడీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. సోమవారం కర్నూలులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ, ఎలక్షన్ కమిషన్ వల్లనే పింఛన్ డబ్బులు పంచలేక పోతున్నామని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరతే కారణం కానీ, తెలుగుదేశం పార్టీ కాదని ఆయన అన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచే ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేయాలని జగన్‌రెడ్డి ఎందుకు ఆదేశాలు జారీ చేయలేదు, ఖజానాలో నిధులు లేకనే కదా అని ప్రశ్నించారు. జగన్ స్వార్థ రాజకీయం వల్ల పింఛన్ దారులు, వాలంటీర్లు నష్టపోతున్నారని, పింఛన్ల సొమ్ముతోపాటూ ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు మార్చి 16-30 మధ్య 15 రోజుల్లో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు సీఎం జగన్ దోచిపెట్టారన్నారు. పేద ప్రజల పింఛన్లు సకాలంలో ఇళ్లవద్దనే పంపిణీ చేయకపోతే సీఎస్ జవహర్‌రెడ్డి, సీఎం జగన్ మోహన్‌రెడ్డిలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీమాధవులకు చక్రస్నానం

» ముగిసిన బ్రహ్మోత్సవాలు » నేడు హుండీ లెక్కింపు



పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 1: మండలంలోని గోరంట్లలో లక్ష్మీమాధవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజున స్వామి అమ్మవార్లకు చక్రస్నానం నిర్వహించారు. అర్చకులు ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుంచి మేళతాళాల మధ్య హంద్రీనదికి తోడ్కొని వెళ్లారు. హంద్రీ జలాలతో శాస్త్రోక్తంగా పూజలు చేస్తూ చక్రస్నానం నిర్వహించారు. వేడుకను పురస్కరించుకుని గ్రామస్థులు రంగులు చల్లి వసంతోత్సవం చేపట్టారు. రాత్రి కంకణ విసర్జన, పూర్ణాహుతిగావించి ఉత్సవాలకు ముగింపు పలికారు. ఈ సం దర్భంగా ఆలయ ఈవో గుర్రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయని, సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం హుండీ లెక్కింపు ఉంటుందని ఈవో పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది మురళి, మాధవనాయుడు అర్చకులు హరిస్వామి, రమణ, పురుషోత్తం, వెంకటరమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వల్లెలాంబదేవి ఉత్సవాలను జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోడుమూరు, ఏప్రిల్ 1: స్థానిక వల్లెలాంబదేవి ఉగాది పండుగ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ ఛైర్మన్, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ పురస్కరించుకొని ఈ నెల 8న ఆలయంలో గోపూజ, గణపతి పూజ, పుణ్యాహావాచనం, గంగపూజ వంటి కార్యక్రమాలతో అమ్మవారి వేడుకలు ప్రారంభం కానున్నాయని అన్నారు. ఉగాది పర్వదినాన ఉదయం రథాంగ హోమం, సాయంత్రం అమ్మవారి రథోత్సవం జరగను న్నాయని చెప్పారు. 10న ఉదయం పారువేట, వసంతోత్సవంతో వేడుకలు ముగియ నున్నాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి వేడు కలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డీలర్ క్రిష్టారెడ్డి, రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, రమేష్‌నాయుడు, రవిబాబు, శ్రీనివాసులు, వాసు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 1: నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. సోమవారం ఆసుపత్రి సమీపంలో కూల్‌డ్రింక్, కిరాణ, బేకరీల్లో దాడులు చేసి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అదేవిధంగా తూనిక రాళ్లకు ముద్రలు లేకపోవ డం, ప్యాకేజీలపై డిక్లరేషన్ లేకపో వడంతో రెండు కేసులు నమోదు చేసి రూ.2 వేల అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరకుమార్ మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ బతుకన్న పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోని ఐఎన్‌టీయూసీ సర్వసభ్య సమావేశం డీసీసీ కే.బాబురావు అధ్యక్షతన జరిగింది. ప్రసాద్, అనంతర్నం మాదిగ, కే మహేష్, బి.హుస్సేన్, రాముడు పాల్గొన్నారు.

'సామాజిక సేవలను మరింత విస్తరిస్తాం'



సండేల్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న సీతారామయ్య తదితరులు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 1: సామాజిక సేవలను మరింత విస్తరిస్తామని బ్రాహ్మణ సంక్షేమ వేదిక రాయలసీమ జోన్ కార్యాధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాదు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధ రంగాల్లో సేవాలు అందిస్తున్న వారిని సత్కరించారు. కర్నూలు నుంచి సామాజిక సేవల్లో ముందుంటున్న బ్రాహ్మణ సంక్షేమ వేదిక రాయలసీమ జోన్ కార్యాధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్‌ను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలా శ్రీనివాస్, విశ్రాంత న్యాయమూర్తులు సీతారామయ్య, బంగారయ్య శర్మ, ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞశర్మ, కర్నూలు బ్రాహ్మణ సంఘాల నాయకులు కొలుకుల చంద్రశేఖర్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో కర్నూలు వాసి హత్య



హరికృష్ణ (ఫైల్ ఫొటో)

చిత్తూరు, ఏప్రిల్ 1: తన భార్యతో సహజీవనం చేస్తున్నాడని ఓ వ్యక్తిని ఆమె భర్త చంపేశాడు. ఈ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. చిత్తూరు జిల్లా కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. సీఐ, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన జయానందపాల్ అలియాస్ హరికృష్ణ (45).. కర్నూలు నగరంలోని ఇందిరమ్మ కాలనీలో స్థిరపడ్డాడు. భార్యతో గొడవపడి విడాకులు తీసుకున్నాక తిరుమలకు వచ్చి ఓ హోటల్‌లో కూలీపనికి చేరాడు. మరోవైపు పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీ గోపాలపురం ఎస్టీకాలనీకి చెందిన చంద్రయ్య భార్య రాణి తన భర్తతో గొడవపడి, విడిపోయి తిరుమలకు వచ్చి హరికృష్ణ పనిచేసే హోటల్‌లోనే కూలీపనికి చేరింది. ఈ క్రమంలో హరికృష్ణ, రాణి మధ్య ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. కొన్నాళ్ల తర్వాత చంద్రయ్య కూడా తిరుమలకు వచ్చి భార్య పనిచేస్తున్న హోటల్‌లోనే పనికి చేరాడు. అప్పటికే హరికృష్ణ, రాణి సహజీవనం చేస్తుండటాన్ని చూసి చంద్రయ్య తట్టుకోలేకపోయాడు. ఎలాగైనా హరికృష్ణ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో మార్చి 26వ తేదీన తన భార్యను ఒప్పించి హరికృష్ణను తిరుపతి సమీపంలోని మంగాపురం తీసుకొచ్చాడు. రాణిని మంగాపురంలో ఉండమని చెప్పి హరికృష్ణను తీసుకుని పీలేరుకు వచ్చాడు. అక్కడ ఇద్దరూ కలిసి మద్యం తాగారు. అక్కడ హత్య చేసేందుకు కుదరకపోవడంతో కల్లూరుకు వచ్చారు. అక్కడా మద్యం తాగి పులిచెర్ల మండలం కల్లూరు నుంచి పులిచెర్ల రోడ్డులోని వ్యవసాయ పొలం వద్దకు చేరుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న హరికృష్ణ తల కుడి భాగంలోని కణతపై బండరాళ్లతో చంద్రయ్య బలంగా కొట్టి చంపేసి, పరారయ్యాడు. మార్చి 29వ తేదీన స్థానికుల సమాచారంతో కల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వీఆర్వో ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో నిందితుడు చంద్రయ్య సోమవారం ఎల్లంకివారిపల్లి వీఆర్వో రాజశేఖర్‌నాయక్ వద్దకు వెళ్లి నేరాన్ని ఒప్పుకున్నాడు. వీఆర్వో కల్లూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడు అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

శ్రీశైల యాత్రికులకు అన్నదాన కేంద్రాలు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 1: శ్రీశైలానికి వెళ్తున్న కర్ణాటక భక్తులకు కోసం నగరంలో అన్నదాన కేంద్రాలను సోమవారం ఏర్పాటు చేశారు. జోహరాపురం రోడ్డులో అన్నదాన కేంద్రాన్ని కృష్ణాజీ వెంకటయ్య, హుస్సేనప్ప, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసులు, అశోక్, కాశీనాథ్, భాస్కర్‌లు ప్రారంభించారు. అదేవిధంగా పెద్దపాడు వద్ద కింగ్స్ ప్యాలస్ గ్రాండ్ కన్వెన్షన్ ఎదురుగా బాలాజీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీశైల పాదయాత్రికులకు అన్నదాన కేంద్రాన్ని వీహె చ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, భరతమాత ప్రఖండ్ అధ్యక్షుడు మొగిలి రవీంద్ర గౌడ్, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా సహకార్యదర్శి ఈపూరి నాగరాజులు ప్రారంభించారు. ఏడు రోజులపాటూ ఈ అన్నదాన కేంద్రం కొనసాగుతుందని బాలాజీ సేవాట్రస్టు గౌరవ సలహాదారు వేమారెడ్డి ధనుంజయరెడ్డి, ఎం.శ్రీకాంత్ తెలిపారు.

పింఛన్ల పంపిణీ చేయాలి

సి.బెళగల్, ఏప్రిల్ 1: వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో శకుంతల పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లకు ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో వారితో సమావేశం నిర్వహించారు. పింఛన్లు అందలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పైప్‌లైన్ ధ్వంసం చేసిన దుండగులు

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 1: మండలంలోని గోరంట్ల గ్రామంలో తాగునీటి పైప్‌లైన్‌ను దుండగులు ధ్వంసం చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక హంద్రీనదికి నీటిని విడుదల చేశారు. దీంతో గ్రామంలో తాగునీటి ఎద్దడి తీరింది. అయితే హంద్రీనదిలో ఏర్పాటు చేసిన 8 తాగునీటి పథకాల్లో 6కు సంబంధించి విద్యుత్ వైరును స్టార్టర్ నుంచి లాగేశారు. వీటిల్లో ఓ తాగు నీటి పథకానికి సంబంధించిన స్టార్టర్ ఫీజులు, పైప్‌లైన్ ధ్వంసం చేశారు. దీంతో స్థానిక మెయిన్ బజార్, టెంపుల్, కురువ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయ అధికారులు భక్తుల కోసం ట్యాంకరు ద్వారా తాగునీరు తెప్పించుకుంటున్నారు. పలువురు ట్యాంకర్ నుంచి నీటిని కొనుగోలు చేసుకున్నారు. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శి కవిత, సర్పంచ్ సద్దల బాలక్రిష్ణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేసవిలో ప్రజలు జాగ్రత్తలు పాటించండి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 1: వేసవిలో ప్రజలు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఉపాధి హామీ పనులు, తాగు నీటి సరఫరా అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో సంబంధిత అధికారులత హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవడంతోపాటు ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ కర్నూలు పట్టణానికి ప్రతి రోజు సుమారు 50 క్యూసెక్కుల నీరు అవసరం అవుతుందన్నారు. అందుకు గానూ 20 క్యూసెక్కుల నీరు సుంకేసుల నుంచి 30 క్యూసెక్కుల నీరు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి తీసుకుంటామన్నారు. ప్రస్తుతం సుంకేసులలో నీరు తక్కువగా ఉండటం వల్ల గాజులదిన్నె నుంచి 30 క్యూసెక్కుల నీటిని తీసుకుంటామని, గాజులదిన్నెలో సుమారు 1.2 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని అన్నారు. కెనాల్ సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల రోజు కేవలం 30 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే తీసుకుంటున్నామని సీఎస్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'జగన్‌రెడ్డిపై ఈసీ చర్యలు తీసుకోవాలి'

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 1: రాష్ట్రంలో పింఛన్లు సకాలంలో ఇళ్ల వద్దనే పంపిణీ చేయకపోతే సీఎస్ జవహర్‌రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి తోపాటు సీఎం జగన్‌రెడ్డిపై ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకోవాలని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సోమవార ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఒకటో తేదీన పింఛన్లను వారి ఇంటికి చేర్చేందుకు జగన్‌రెడ్డి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం స్వార్థరాజ కీయాల వలనే పింఛన్‌దారులు, వలంటీర్లు నష్టపోతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పింఛన్‌దారులకు ఇంటి వద్దే నెలకు రూ.4వేలు అంది స్తుందన్నారు. పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరత ప్రధాన కారణమని, ఎన్నికల కమిషన్, తెలుగుదేశంపార్టీ కాదని ప్రజలు గమనిం చాలని బొగ్గుల దస్తగిరి తెలిపారు.

కల్లూరు అర్బన్‌లో వైసీపీకి షాక్

» గౌరు చరిత, బైరెడ్డి శబరి సమక్షంలో టీడీపీలో చేరిక

కల్లూరు, ఏప్రిల్ 1: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. కల్లూరు అర్బన్ 19 వార్డులో వైసీపీ ముఖ్య నాయకుడు తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం మారుతీనగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డితో పాటు 10 కుటుంబాలు పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి వారు ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చిన్నరుస్తూం, పుల్లారెడ్డి, పరమేష్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, బూత్ కమిటీ మెంబర్ స్వాతి, రమేష్‌యాదవ్, తిమ్మయ్యయాదవ్, శివన్న, గంగులు, మౌలాలి, సత్యం పాల్గొన్నారు.

- 34వ వార్డు జంపాల శివయ్యనగర్‌కు చెందిన ఎరుకలి శివుడు, మంగల్ మధు, నరసింహా ఆధ్వర్యంలో 60 కుటుంబాలు వైసీపీని వీడి గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గోవిందమ్మ, సరోజ, గిడ్డ మ్మ, పద్మ, లక్ష్మీదేవమ్మ, ఆదిలక్ష్మీ, దీవనమ్మ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కోశాధికారి వీయూ.మాదన్న, భాస్కర్‌గౌడ్, నారాయణగౌడ్, బీసన్న, దిలీప్ పాల్గొన్నారు.
- 36వ వార్డు రాజీవ్‌గృహకల్పకు చెందిన ఆనంద్‌ఆచారి, ప్రసాద్‌తో పాటు 10 కుటుంబాలు వైసీపీని వీడి గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి రెడ్డిగారి తిరుమలేష్‌రెడ్డి, పెద్దబీచుపల్లి, కురువ ధనుంజయ, చిన్నబీచుపల్లి, శేఖర్‌చౌదరి, నాగరాజు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో గౌరు చరిత, బైరెడ్డి శబరి

సైకో పాలనను సాగనంపండి: గౌరు చరిత

రాష్ట్రంలో జగన్ సైకో పాలనను సాగనంపాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు టెలికాంనగర్‌లో ఆమె శంఖారావం, టీడీపీ సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని మేనిఫేస్టో పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్లె రఘునాథ్‌రెడ్డి, పెరుగు దుర్గాప్రసాద్‌రెడ్డి, కట్ట వెంకటరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, మాండ్ర నరేంద్రనాథ్‌రెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, జనసేన నాయకులు ప్రవీణ్, విజయ్ యాదవ్, టీచర్ జగదీష్, నాగముని, శ్రీరాములు, అయ్యస్వామి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ బాధ్యత ప్రభుత్వానిదే

- పింఛన్ల పంపిణీపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ
- ఈసీ ఆదేశాలను టీడీపీపై రుద్దడం సరికాదు
- జగన్ ప్రభుత్వ చేతగాని తనానికి ఇదే నిదర్శనం
- ఎమ్మిగనూరు, మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు జయనాగేశ్వరరెడ్డి, రాఘవేంద్రరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి, రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం/ఎమ్మిగనూరు ఏప్రిల్ 1: సామాజిక పింఛన్లు పంపిణీ చేసే బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని, ఈసీ ఆదేశాల మేరకు వలంటీర్లతో కాకుండా ప్రత్యామ్నాయంగా ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రాలయం, ఎమ్మిగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు జయనాగేశ్వరరెడ్డి, ఎం.రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మాధవరం, ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన వేర్వేరు విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడారు. 1వ తేదీన అవ్వాతాతలు, వికలాంగులు మొదలగు వారికి పంపిణీ చేసే పింఛన్ సొమ్మును మున్సిపాలిటీలో తన బంధు వర్గాల కాంట్రాక్టర్లకు రూ.13వేల కోట్ల నిధులను వైసీపీ ట్రాన్స్‌ఫర్ చేసిందని ఆరోపించారు. పింఛన్ పంపిణీకి డబ్బు లేకపోవడంతో అవ్వాతాతలను ఇబ్బందులు పెట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నిలుపుదల చేయించారని విషప్రచారం చేయడం సిగ్గు చేటని విమర్శించారు. ప్రతి సచివాలయంలో ఉద్యోగులు ఉండగా.. వారి ద్వారా ఎందుకు పింఛన్ పంపిణీ చేయడం లేదన్నారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించింది టీడీపీనేనని గుర్తుచేశారు. గత నెల ఫిబ్రవరి 16న జగన్ రెడ్డి బటన్ నొక్కినా ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లో ఎందుకు జమ కాలేదన్నారు. ఇది జగన్ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు. ఎన్నికల్లో పింఛన్‌దారులను టీడీపీకి దూరం చేయాలని విషప్రచారం చేస్తున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఇప్పటికైన టడీపీపై దుష్ప్రచారం మానుకొని వెంటనే పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు రామదాసు, వీజేపీ దయాసాగర్, నాయకులు మిఠాయి నరసింహులు, పల్లెపాడు రామిరెడ్డి, ముత్తురెడ్డి, బసలదొడ్డి ఈరన్న, రామక్రిష్ణ, కౌతాళం సుబ్రహ్మణ్యం రాజు, అయ్యప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 1: పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్-2024 పరీక్షకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తరగతులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కోచింగ్ ఉంటుందన్నారు. ఈ నెల 27న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఉచిత కోచింగ్‌తో పాటు అవసరమైన మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 79016 20203 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

ఆదోని టౌన్, ఏప్రిల్ 1: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్ర రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇవ్వడంపై రాహుల్ గాంధీ తొలి సంతకం చేస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నూర్ అహ్మద్ అన్నారు. సోమవారం రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఆ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రుణమాఫీతో పాటు వారి పెట్టుబడిలో 50 శాతం లాభంతో కొత్త మద్దతు ధర ప్రకటిస్తామని పేర్కొన్నారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. సీనియర్ నాయకుడు కుప్పగల్ అయ్యప్ప, తుని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నెట్టికల్ హనుమంతు, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి మొహమ్మద్ పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ : ఎంపీడీవో

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 1: ఎమ్మిగనూరు మండలంలోని అన్ని గ్రామాల్లోని పింఛన్ లబ్ధిదారులకు 3వ తేదీన పింఛన్లు అందజేస్తారని ఎంపీడీవో కొండన్న తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆయా గ్రామాల్లో ఉన్న వలంటీర్లకు పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించడం లేదన్నారు. 3వ తేదీ ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయ సిబ్బంది పింఛన్లను అందజేస్తారన్నారు. లబ్ధిదారులు ఆధార్ కార్డును సచివాలయానికి తీసుకెళ్లి పింఛన్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఆయన కోరారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఉపాధి ఉద్యోగి, వలంటీర్



సాతనూరులో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధి ఉద్యోగి జాన్

కోసిగి, ఏప్రిల్ 1: ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు రాజకీయ నాయకుల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలున్నప్పటికీ కొంతమంది ఉద్యోగులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. సోమవారం సాయంత్రం సాతనూరు గ్రామంలో వైసీపీ మండల ఇన్‌చార్జి మురళిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రాలయం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి తరుపున ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ఆదోని మండలంలోని ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జాన్ వైసీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈయనతో పాటు గ్రామానికి చెందిన వలంటీర్ వడ్డె రమేష్ వైసీపీ నాయకులతో కలిసి తన క్లస్టర్‌లోని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు వీరిపై చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు కోరారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

తుగ్గలి, ఏప్రిల్ 1: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే ప్రభుత్వ ఉద్యోగులు, వాలంటీర్లపై చర్యలు తప్పవని తహసీల్దార్ షర్మిళ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, వాలంటీర్లు ఎవరైనా కూడా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు.

16 మంది వలంటీర్లు రాజీనామా

పత్తికొండ, ఏప్రిల్ 1 : మండల పరిధిలో పెద్దహుల్తి, దేవనబండ గ్రామాలలో పనిచేస్తున్న 16మంది వలంటీర్లు తమ రాజీనామాలను సోమవారం ఎంపీడీవో రామారావుకు అందించారు. పెద్దహుల్తి గ్రామానికి చెందిన ఐదుగురు, దేవనబండ గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు అందించిన రాజీనామాలను జిల్లాఅధికారికి పంపిస్తామని వారిఆదేశాలమేరకు రాజీనామాలను ఆమోదిస్తామని ఎంపీడీవో తెలిపారు.

వెల్దుర్తి : పట్టణంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ శివశంకరప్పకు పట్టణంలో ఉన్న 67 మంది వలంటీర్లు తమ రాజీనామాలను అందజేశారు. అదేవిధంగా చెరుకులపాడు గ్రామ వలంటీర్లు 18 మంది తమ రాజీనామాలను లిఖితపూర్వంగా ఎంపిడిఓకు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గోనెగండ్ల, ఏప్రిల్ 1: తిప్పనూరు గ్రామ సమీపంలోని బ్రిడ్జ్ దగ్గర అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ యజమానుల పై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. తిప్పనూరు గ్రామ బ్రిడ్జి దగ్గర సోమవారం కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన బోయ తుమ్మిళ్ల మధు అనే యువకుడు ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు కాపు కాచి ఇసుకను తరలిస్తున్న సమయంలో ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమాని తుమ్మిళ్ల మధుపై పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత: అగ్రహారం గ్రామ శివార్ల దగ్గర అక్రమ మద్యం అమ్ముతున్న తలారివెంకటేశ్, బోయ బడేసాబ్, లపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. అగ్ర హారం గ్రామం దగ్గర కర్ణాటక మద్యంను అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించగా వారి దగ్గర నుంచి 35 టెట్రాపాకెట్లు (90ఎంఎల్) స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేకు నిరసన సెగ



బిల్లులు రాలేదని ఎమ్మెల్యేను నిలదీస్తున్న మహిళ

వెల్దుర్తి, ఏప్రిల్, 1 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండగా గ్రామస్తుల నుంచి నిరసన ఎదురైంది. సోమవారం మండలంలోని బుక్కాపురం గ్రామంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో గ్రామానికి చెందిన ముస్లిం మహిళ ఇల్లు నిర్మాణం చేసుకున్నా, ఇంటి బిల్లు రాలేదని, అదేవిధంగా కరువు పనిలో తమ పేరు ఎక్కించలేదని ఎమ్మెల్యేను నిలదీశారు. 'ఏమ్మా మేము ఓట్లు వేయలేదా? ఎందుకు మాకు బిల్లులు రావడం లేదు? కరువు పనిలో ఎందుకు మా పేరు ఎక్కించలేదు' అంటూ ఆ మహిళ ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. అలాగే నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఎస్సీ కాలనీవాసులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్‌వచ్చిందంటూ ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జగన్ పాలనకు చరమగీతం పాడుదాం

- ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్



వీరభద్ర గౌడ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆలూరు, ఏప్రిల్ 1: వైసీపీ పాలనకు చరమగీతం పాడుదామని ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ కోరారు. సోమవారం ఆలూరు టీడీపీ కార్యాలయంలో ఆస్పరి మండలం శంకరబండ గ్రామం, వైసీపీకు చెందిన 50 కుటుంబాలు నాగేంద్ర రెడ్డి, నరసింహులు, ఓబులేసు, నితిన్, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రామప్ప, తిమ్మయ్య టీడీపీలోకి చేరారు. వీరిని వీరభద్ర గౌడ్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీను అమలు చేస్తారన్నారు. జగన్ అవినీతి, దౌర్జన్య పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నేత గిరిమల్లేశ్ గౌడ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వచ్చి వీరభద్ర గౌడ్‌కు మద్దతుగా నిలుస్తున్నారు.

పింఛన్ నాలుగు వేలు ఇస్తాం

- కేఈ శ్యాంబాబు



టీ.గోకులపాడులో ప్రచారం నిర్వహిస్తున్న కేఈ శ్యాంబాబు

క్రిష్ణగిరి, ఏప్రిల్ 1: టీడీపీ అధికారంలోకి వస్తే అవ్వ, తాతలకు పింఛన్ నాలుగు వేలు ఇస్తామని టీడీపీ పత్తికొండ నియోజకవర్గ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం టీ.గోకులపాడు, తొగర్చేడు, యాగంటిపల్లి, కొత్తూరు గ్రామాలలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి చెందాలన్న, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు.

పింకషన్ సొమ్ము కాజేసి మాపై నిందలా : పింఛన్ సొమ్ముతో పెండింగ్ బిల్లులు చెల్లించి ఒకటవ తేదీన పింఛన్ పంచలేక వైసీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే తమపై నిందలు వేయడం తగదని కేఈ శ్యాంబాబు అన్నారు.

ఎన్నికల నిర్వహణపై నేడు సమీక్ష

ఆలూరు, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై మంగళవారం ఆలూరు జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 9 గంటలకు కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహిస్తారని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాముినాయక్ సోమవారం తెలిపారు. ఎన్నికల బూత్ లెవెల్ అధికారులు, సహాయ ఎన్నికల అధకారులు తప్పక హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

ఆదోని టౌన్, ఏప్రిల్ 1: పట్టణంలో 3వ తేదీ నుంచి పింఛన్లను పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో వృద్ధాప్య, వితంతు, చేనేత, ఒంటరి మహిళ, దివ్యంగులు, చర్మకారులు, డప్పు కార్మికులు, కల్లు గీత, డయాలసిస్ పొందుతున్నవారు, ట్రాన్స్‌జెండర్స్ పింఛన్లు పంపిణీ జరగాల్సి ఉందన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి దూరంగా ఉంచామని, వారి నుంచి ఫోన్లు, బయోమెట్రిక్ స్కానర్లను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఆలూరు, ఏప్రిల్ 1: వ్యవసాయ పనులకు వెళ్లి రద్దు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా నాయకులు లింగన్న, హనుమంతు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం హులేబీడులో మృతుల కుటుంబాలను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం హులేబీడు గ్రామం నుంచి చిప్పగిరి మండలానికి వ్యవసాయ పనుల కోసం వెళ్లి తిరిగి వస్తూ హత్తిబెళగల్ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంతో ముగ్గురు మృతి చెందారన్నారు. 20 మంది వరకు కాళ్లు, చేతులు విరిగి గాయాల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన ప్రతి కుటుంబానికి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.25 లక్షల పరిహారం అందించాలన్నారు. గాయపడిన ప్రతి ఒక్కరికి రూ.లక్ష రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. సంఘం తాలూకా నాయకులు కృష్ణ, రైతు సంఘం ఆలూరు మండల కార్యదర్శి యూ వీరన్న పాల్గొన్నారు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలని చూస్తున్నారు

మద్దికెర, ఏప్రిల్ 1 : మద్దికెర గ్రామ సాయినగర్ కాలనీలో కమ్యూనిటీ పర్పస్ కోసం వదిలేసిన రూ.లక్షల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలని చూస్తున్నారని కాలనీకి చెందిన మురళి మోహన్, గొడుగుల వేణుగోపాల్, నల్లబోతుల వెంకటప్ప అన్నారు. సోమవారం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి స్వర్ణలతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ పంచాయతీ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి.. నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించాలని చూస్తున్నారని ఆరోపించారు. కాలనీలో ప్రభుత్వం పాఠశాలకు ఆటస్థలం కోసం 36 సెంట్ల స్థలాన్ని వదిలిందని, కొందరు స్వార్థపరులు వాటిని ఆక్రమించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే ఆ నకిలీ పత్రాలను రద్దు చేసి ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో వడ్డె చిట్టి, నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



విజయ్ కుమార్ (ఫైల్)

పత్తికొండ, ఏప్రిల్ 1: పత్తికొండ మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన విజయ్ కుమార్ (32) అనే రైతు అప్పులబాధ తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత విజయ్ కుమార్ ఉరి వేసుకోగా.. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుల బాధతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

ఆటో ప్రమాదంలో మహిళ కూలీ మృతి



ఆటో ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీ

చిప్పగిరి, ఏప్రిల్ 1: ఆటో ప్రమాదంలో మహిళా రైతు కూలి మృతి చెందిన సంఘటన సోమవారం చిప్పగిరిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆదోని మండంలోని చాగి గ్రామానికి చెందిన లక్ష్మీ చిప్పగిరిలోని పొలాలని మిరప పంటను కోయడానికి కూలీ పనుల నిమిత్తం తమ గ్రామ కూలీలతో కలిసి చిప్పగిరి గ్రామానికి ఆటోలో వెళ్లారు. పొలం దూరంగా ఉండటంతో చిప్పగిరికి చెందిన ఆటోలో పొలానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కింద పడటంతో మృతి చెందింది. విషయం తెలుసుకుని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. ఎస్సై మహమ్మద్ రిజ్వాన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త బసవరాజు, ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు.

తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 1: ప్రతినెలా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పంపిణీ చేసే పింఛన్ల పంపిణీపై వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని కర్నూలు పార్లమెంట్ టీడీపీ కురవ సాధికారిక కమిటీ సభ్యులు కె.టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆయా గ్రామాల్లోని వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయరాదని ఎన్నికల అధికారులే సంబంధిత శాఖా అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కొందమంది వైసీపీ నాయకులు వలంటీర్లచే పింఛన్ పంపిణీ చేయకుండా తెలుగుదేశం నాయకులు అడ్డుపడుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4వేలు అందజేస్తానని టీడీపీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. పింఛన్ విధానాన్ని అమలులోకి తెచ్చిందే తెలుగుదేశం పార్టీ అన్నారు. ప్రజల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉంటుందని, వైసీపీ నాయకులు చౌకబారు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

ఏప్రిల్ ఫూల్ చేసిన సీఎం జగన్

పెద్దకడబూరు, ఏప్రిల్ 1: ప్రతి నెలా ఒకటో తేదిన అందాల్సిన సామాజిక భద్రత పెన్షన్లు ఈ నెల అందకపోవడంతో పెన్షన్ దారులంతా ఇబ్బందులకు గురియ్యారని, వారినందరిని సీఎం జగన్ ఏప్రిల్ ఫూల్ చేశారని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. ఎన్నికల కోడ్ అమలైన తర్వాత ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి వలంటీర్లకు ఏర్పాటు చేయకుండా పెన్షన్‌దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణమే పెన్షన్లును పంచాలని డిమాండ్ చేశారు

మంత్రాలయంలో నీరు లేదనే ప్రచారాన్ని నమ్మొద్దు

- మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు
- 1200 రూములు అందుబాటులో ఉన్నాయి

మంత్రాలయం, ఏప్రిల్ 1: రాఘవేంద్రస్వామి మఠం ప్రాంగణాల్లో అతిథి గృహాల్లో నీరు లేదనే తప్పుడు ప్రచారాలను భక్తులు నమ్మొద్దని మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు 1200 రూములు భక్తులకు అందుబాటులో ఉన్నాయని, ప్రతి గదికి నీరు ఉంటుందని పేర్కొన్నారు. కొంత మంది పని కట్టుకుని మంత్రాలయం మఠం పరిసర ప్రాంతాల్లో నీరు లేదని ప్రచారం చేస్తున్నారని, ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులు రాఘవేంద్రస్వామిని దర్శించుకోవాలని కోరారు. భక్తుల కోసం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు వసతి, తాగునీరు, ఉచిత అన్నదానం, పరిమళ ప్రసాదం, క్యూలైన్లు, అన్నపూర్ణ భోజనశాల ఎదుట ఎండవేడిమికి రూ.44 లక్షలతో ప్రత్యేక షెల్టర్ కూడా నిర్మించారని గుర్తు చేశారు.



2 మాట్లాడుతున్న ఎస్కే శ్రీనివాసరావు

విద్యా వ్యాప్తికి కృషి చేస్తాం : బిషప్ ఆంథోని

మంత్రాలయం, ఏప్రిల్ 1: రాష్ట్రంలోనే వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మంత్రాలయంలో విద్యా వ్యాప్తి కోసం మార్థోమ మిషన్ విశేషంగా కృషి చేస్తుందని కేరళ కోటెమ్ మార్థోమా డైసిస్ బిషప్ రైట్.రెవరెండ్ థోమస్ అన్నారు. ఆదివారం మండలంలోని మాధవరం సెయింట్ మార్థోమ పాఠశాలను, చర్చిని జాన్‌కే జాకోబ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి విద్యార్థులు తక్కువ ఫీజుతో అందిస్తున్న విద్యను అడిగి తెలుసుకున్నారు. విద్యా వ్యాప్తికి మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విద్యకు నిరక్షరాస్యత అధికంగా ఉన్నారని గుర్తించి సెయింట్ మార్థోమ పాఠశాలను ఏర్పాటు చేసి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను తీర్చిదిద్దేందుకు తక్కువ ఫీజుతో పాఠశాలను ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ ప్రాంతం విద్యతో ఎంతో అభివృద్ధి చెందాలని, దీనికి అవసరమైన నిధులు కేటాయిస్తామని తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకునేందుకు ముందుకు రావాలన్నారు. అలెక్స్ అబ్రహం, నోబుల్ థోమస్, సైమన్ కురియన్, జోజో థోమస్, ఆనంద్, సాంసోన్, విజయ్, ఈరన్న, రాజరత్నం పాల్గొన్నారు.



మార్థోమా చర్చిలో మాట్లాడుతున్న కేరళ బిషప్

22న పత్తికొండలో మాదిగల చైతన్య ర్యాలీ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 1: ఈ నెల 22న పత్తికొండ పట్టణంలో మాదిగల చైతన్య ర్యాలీ, సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు బొందిమడుగుల రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో చైతన్యర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా మాదిగలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థల్లో సమానహక్కులు కల్పించాలని కోరారు. పాలకుల నిర్లక్ష్యం వల్లనే దళితులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికి దళితులపై కులవివక్షత, అంటరానితనం కొనసాగుతూనే ఉందని, అలాగే పెత్తందారులు దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని అన్నారు. మాదిగల అభివృద్ధి, సంక్షేమం, సాధికారత, స్వేచ్ఛ సమానత్వం కోసం ఈ నెల 22న పత్తికొండలో తలపెట్టిన మాదిగల చైతన్యర్యాలీ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గిడ్డయ్య మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి రామాంజనేయులు, పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి రామాంజనేయులు, నాయకులు ఆంజనేయులు, మద్దిలేటి, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చదరంగంలో చిచ్చరపిడుగు



చదరంగంలో జాతీయ స్థాయిలో రేటింగ్ సాధించిన ఉదయ్ కిరణ్)

మద్దికెర, ఏప్రిల్ 1 : మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి చెందిన రామారావు కుమారుడు కురుముల ఉదయ్ కిరణ్ జాతీయ స్థాయి చదరంగం పోటీల్లో రేటింగ్ సాధించి శభాష్ ఉదయ్ కిరణ్ అంటూ అభినందనల వర్షం కురిపించారు. వివరాల్లోకి వెళితే.. మద్దికెర గ్రామంలోని ఫ్రెండ్స్ విద్యానికేతన్‌లో 6వ తరగతి చదువుతున్న ఉదయ్‌కిరణ్ చిన్నప్పటి నుంచే చదరంగంలో రాణిస్తూ వస్తున్నాడు. గత రెండు రోజుల కింద నెల్లూరు పట్టణంలో మస్తానయ్య ఆలిండియా ర్యాపిడ్ ఓపెన్ చదరంగం పోటీల్లో 1451 రాపిడ్ రేటింగ్ సాధించి చరిత్రలోనే నిలిచిపోయాడు. ఈ సందర్భంగా పాఠశాల ఎండీ పెరవలి రామాంజినేయులు మాట్లాడుతూ చదువుతో పాటు ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఉదయ్‌కిరణ్ చదరంగం పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించి మద్దికెర చరిత్రలోనే నిలిచారన్నారు. తమ విద్యార్థిని పలువురు ప్రశంసల వర్షం కురిపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, గోవిందు, శ్రీనివాస్, మస్తాన్ తదితరులు ఉన్నారు.

శివాని ఆత్మస్థైర్యం గెలిచింది



బంగారు పతకం సాధించిన శివానిని సన్మానిస్తున్న జి.పుల్లయ్య

మద్దికెర, ఏప్రిల్ 1 : మద్దికెర గ్రామానికి చెందిన దివ్యాంగురాలు శివాని ఆత్మస్థైర్యం ముందు అంగవైకల్యం ఓడిందని కర్నూలు రవీంద్ర ఎడ్యుకేషనల్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఇంజనీరింగ్ కాలేజీ ఆఫ్ చైర్మన్ జి.పుల్లయ్య, రాష్ట్ర చీఫ్ అడ్వకేట్ సుష్మా అన్నారు. సోమవారం స్థానిక విద్యాసాయి పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకున్న ఉప్పరి శివాని జాతీయ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ జావెలిన్ త్రోలో బంగారు పతకాన్ని సాధించడంతో శివానిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివానికి పుట్టుకతోనే కుడి చేయి లేదని, అయినా జావెలిన్‌త్రోలో రాష్ట్ర స్థాయిలో సత్తా నిరూపించకుందన్నారు. గత ఏడాది థాయిలాండ్‌లో జరిగిన ప్రపంచ స్థాయి జావెలిన్‌త్రోలలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించి అందరి మన్ననలు పొందిందని పేర్కొన్నారు.